క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 9:30 నుంచి 12:30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అశ్వారావుపేటరూరల్: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫారాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేట, నారంవారిగూడెం లోని సబ్‌స్టేషన్ల పరిధిలోఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చంద్రుగొండ: చంద్రుగొండలోని 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా చంద్రుగొండ, అయన్నపాలెం, దామరచర్ల, తిప్పనపల్లి, సత్యనారాయణపురం, దుబ్బతండా, రావికంపాడు, బాలికుంట, బెండాలపాడు, గుర్రాయిగూడెం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వివరించారు. ట్రాన్స్‌కో మండల ఏఈ ఎంఎల్ నర్సింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

క్రెడిట్ సొసైటీ ఎన్నికలు నిర్వహించాలి

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో క్రెడిట్ సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పీవీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్మిక శ్రేయస్సు, సింగరేణి పురోభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కార్మిక సంఘాలన్ని కలిసి క్రెడిట్ సొసైటీ ఎన్నికలు నిర్వహించేలా కృషి చేయాలని కోరారు. యూనియన్‌కు ఒక సభ్యుని చొప్పున నియమించి సొసైటీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. క్రెడిట్ సొసైటీ ఎన్నికలకు మిగతా సంఘాలు కూడా అంగీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజలింగు, ముక్తేశ్వరరావు, పెదనాగయ్యపాల్గొన్నారు.

5కే రన్‌ను జయప్రదం చేయండి

మణుగూరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కల్పిస్తూ రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే 5కే రన్‌ను జయప్రదం చేయాలని మణుగూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రమాదేవి శుక్రవారం తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ... ఉదయం 6గంటలకు హనుమాన్ టెంపుల్ వద్ద 5కే రన్ ప్రారంభమవుతుందని, ఈ రన్‌లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రుణమాఫీతో అన్నదాతలకు ఊరట

మణుగూరు రూరల్: అప్పుల ఊబిలో చిక్కుకున్న అన్నదాతలకు సీఎం కేసీఆర్ లక్ష రూపాయల రుణమాఫీ చేసి ఊరట కలిగించారని మణుగూరు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సహకార సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... రైతుల శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. మండలంలోని 174మంది రైతులకు సంబంధించి రుణాలను మాఫీ చేసినట్లు ఆయన తెలిపారు. రుణ మాఫీపై అనుమానాలు, కొత్త రుణాల కోసం రైతులు సంఘ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అనంతరం రుణమాఫీ చేసిన సీఎం కేసీఆర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

ములకలపల్లి : జీవితంలో సమస్యలు సహజమని, ప్రతీ విషయంలోనూ పాజిటివ్ థింకింగ్ అలవర్చుకొని ముందుకు సాగాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస బోధకులు డాక్టర్ గాజర్ల వీరభద్రం గురూజీ సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస తరగతుల నిర్వహణలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురికాకుండా విజయ తీరాలకు చేరుకోవాలన్నారు. లెక్చరర్లు చావా రాజేశ్వరి, మైలగాని చంద్రమౌళి, రామకృష్ణ, సుధాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జేబు దొంగల అరెస్ట్

భద్రాచలంఅర్బన్: ఇద్దరు జేబుదొంగలను శుక్రవారం పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనం చేసుకుని అనంతరం బస్‌లో కొత్తగూడెం వెళ్తున్న భిక్షపతి అనే భక్తుడు బ్రిడ్జి సెంటర్ వద్దకు బస్ రాగానే తన వద్ద ఉండాల్సిన ఫోన్, పర్సు కనిపించకపోవడంతో అదే బస్సులో అనుమానస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించాడు. వారిని విచారించగా, వారి వద్ద రెండు మొబైల్ ఫోన్లు, రూ.500లు నగదు లభించాయని కాగా వీరిద్దరు పట్టణానికి చెందిన వానపల్లి సతీష్, జంపయ్యలుగా విచారణలో తెలిందని సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

పాపన్న ఆశయ సాధనకు కృషి



అశ్వారావుపేట: పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

అశ్వారావుపేట: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలకు ప్రతీఒక్కరు కృషి చేయాలని పలువురు అన్నారు. సర్వాయి పాపన్న జయంతి పురస్కరించుకుని శుక్రవారం అశ్వారావుపేట గౌడ బజారులో గౌడ సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అరేపల్లి సాంబశివరావు, తాళం సూరిబాబు, మైనం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని రాజాపురం, అన్నపురెడ్డిపల్లి గ్రామాలలో గౌడ సంఘాల ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బోడా పద్మ, ఉప సర్పంచ్ పర్సా వెంకటేశ్వర్లు, నాయకులు చిన్ని, కృష్ణార్జున రావు, వెంకటేశ్వరరావు, రాఘవులు, శ్యామ్‌కుమార్, పూర్ణ, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మండల గౌడుల సంఘం ఆధ్వర్యంలో సురక్షా బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కూనవరం పంచాయతీ కార్యాలయంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడుల ఐక్యత సంఘం నాయకులు, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, వార్డ్‌మెంబర్ కలగూర శంకర్, వల్లభనేని రమణ, గిరిజన మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు వంక అర్జున్‌రావు, మహమ్మద్ మూసా పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలకేంద్రంలో గౌడసంఘం జెండాను ఆవిష్కరించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, కిషన్‌గౌడ్, హరిష్, కేశవరావు, వీరప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పానుగంటి సత్యం, మిడతా లక్ష్మినారాయణ, రామారావు, యార్లగడ్డ సూరి, పానుగంటి లక్ష్మణ్, రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లిలో..



మణుగూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



చంద్రుగొండలో..



దమ్మపేటలో..

భద్రాచలం టౌన్: భద్రాచలం పట్టణంలో ఏజెన్సీ గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బంధం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకన్న, వీరన్న, రంగారాజు, మురళి పాల్గొన్నారు.

భాషకందని భావం.. ఛాయాచిత్రం





ఆదివాసీ గిరిజనుల జీవన శైలిపై షరీఫ్ తీసిన ఫొటోలు

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

భద్రాచలం టౌన్: ఒక ఛాయాచిత్రం కోటి భావాలను కదలిక, నిలువెత్తు సాక్ష్యాలకు నిలువుటద్దం. ఒక్క ఫొటో ఎన్నో భావాలను ఆవిష్కరిస్తుంది. ప్రకృతి అందచందాలు చెప్పేందుకు కవులకు బోలెడు మాటలు కావాలి కానీ కెమెరా కన్ను వాటిని ఒక్క ఫొటో ఆవిష్కరిస్తుంది. ప్రకృతి అందాలనే కాదు ప్రకృతి ఆగ్రహావేశాలు, కోపతాపాలు, పెళ్లి, పుట్టిన రోజు, సంతోష క్షణాలు, మానవ వికాసానికి నిదర్శనంగా నిలిచే అద్భుత కట్టడాలను ఇలా ఎన్నెన్నో పదిలపరిచి అందించేది ఫొటో. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా చిరుకథనం..

నేడు ఫొటోగ్రఫీ అత్యధిక ప్రాధాన్య రంగంగా మారింది. ఎన్నో అందాలను తనలో దాచుకునే ఫొటోగ్రఫీ మారుతున్న కాలంతోపాటు సాంకేతికంగా ఫిల్మ్ కెమెరాల నుంచి ఆధునిక డిజిటల్ కెమెరాల వరకు అభివృద్ధి చెందింది.

అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భద్రాద్రి ఫొటోగ్రాఫర్

అడవుల్లో ప్రకృతి ఒడిలో జీవనం సాగిస్తున్న ఆదివాసీల జీవన శైలిని చిత్రీకరించి భద్రాచలం పట్టణానికి చెందిన షరీఫ్ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను అందుకున్నాడు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివాసీల జీవన శైలిని, వారి బతుకు చిత్రాలను తన కెమెరాలో బంధించాడు. అంతర్జాతీయ స్థాయి పోటీలలో 2013, 2017 సంవత్సరాల్లో అమెరికాలోని ఇమేజ్‌క్లేగ్ సొసైటీ ఫొటోషిప్ రెండు అవార్డులు, 2016లో ఆర్టిస్ట్ ఆఫ్ యూనిటెడ్ స్టేట్స్ ఫొటోగ్రఫీ అలాన్సిస్ అవార్డును అందుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలలో రెండు అవార్డులను అందుకున్నాడు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నాగేశ్వరరావు

దమ్మపేట: పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ఎమ్మెల్యే నివాసం తాటిసుబ్బన్నగూడెంలో ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, పార్టీలో చేరామన్నారు. అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు వెంట ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వలమాలిన నాగలక్ష్మి, పల్లె శ్రీను, పల్లె నాగు, వలమాల వెంకటేశ్వరరావు, మల్లిక, స్వర్ణ, చందన తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రేగా కాళికా

కరకగూడెం: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ రేగా కాళికా అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాదాసీదాగా సాగింది. మండలంలో జరుగుతున్న, జరిగిన పనుల గురించి ప్రజాప్రతినిధులను, అధికారులను అడిగారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతితో అనేక నిధులను పంచాయతీలకు ఇస్తోందని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే ఇంకా అధిక మొత్తంలో పంచాయతీలకు నిధులు వస్తాయన్నారు. అదేవిధంగా సర్పంచులు, అధికారులు కచ్చితంగా సమావేశంలో సమయపాలన పాటించాలని, అలా పాటించని వారిపై చర్యలు తీసుకోకతప్పదన్నారు. అంతేకాకుండా సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కొమరం కాంతారావు, ఎంపీడీఓ శంకర్, ఎంఈఓ వీరస్వామి పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం



కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న వెంకటరెడ్డి, నాయకులు

బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీజేపీని బలోపేతం చేస్తామని పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని కలిసిన పార్టీ జిల్లా నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీ తిరుగులేని శక్తిగా మార్చేందుకు శ్రేణులు క్షేత్రస్థాయి నుంచి కష్టపడాలని కోరారు.

శ్రావణ పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అశ్వారావుపేటరూరల్: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో తొలి శ్రావణ శుక్రవారం పూజలు చేశారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పూజలు చేశారు. అలాగే ఆలయంలో లలితా సహస్ర పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అదే విధంగా ఆలయంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీవీ కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న వెంకట్, నాయకులు

భద్రాచలంఅర్బన్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు పీవీ శ్రీనివాస్ కుటుంబాన్ని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ శుక్రవారం పరామర్శించారు. ముందుగా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పీవీ శ్రీనివాస్ ఉద్యమ ప్రస్థానం భద్రాచలంలో ప్రారంభమై అంచలంచెలుగా ఎదిగారని, విద్యార్థి, యువజన ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఎస్వీ రాఘవులు, నాయకులు రాజు, విజయ్, తావూరియా, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు ఎస్.నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం



ఆలయ ప్రతిష్ఠాపనలో అర్చకులు, గ్రామస్తులు

దుమ్ముగూడెం: మండలంలోని డబ్ల్యూఎల్ రేకుపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ దేవత ముత్యాలమ్మ దేవాలయ ప్రతిష్ఠాపన ప్రారంభించారు. అర్చకులు సురేష్ శర్మ, రాఘవ శర్మ, నూతన ఆచార్యులు, దామేశ్వర శర్మ ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, స్వస్తిహి పుణ్యాహవాచనం, సకల దేవత భద్రమండలి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, కలశ ప్రతిష్ఠాపన పూజలు చేపట్టారు. అనంతరం ముత్యాలమ్మ, పోతరాజు శిలా విగ్రహాలు ప్రతిష్ఠాపన చేశారు.

నిబంధనలు పాటించాలి



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంవీఐ తిరుపతి

బూర్గంపాడు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ తోట తిరుపతి అన్నారు. సారపాకలో శుక్రవారం వెంకటరమణ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి వుండాలన్నారు. వాహనానికి సంబంధించిన ఆర్‌సీ బుక్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



అశ్వారావుపేటరూరల్: దోమల నివారణ మందు చల్లిస్తున్న వైద్యాధికారి రాందాస్ నాయక్

దుమ్ముగూడెం: ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో అనారోగ్యం భారిన పడకుండా ఉంటారని దుమ్ముగూడెం పీహెచ్‌సీ డాక్టర్ పుల్లారెడ్డి సూచించారు. శుక్రవారం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చిన్న కమలాపురం గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం లచ్చగూడెం సబ్ సెంటర్ లోని హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించారు. అలాగే ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, ఎల్సీడీసీ సర్వేను పరిశీలించారు. మొబైల్ డాక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ సూచించారు. మండలంలోని కుడుములపాడు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, 43 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సీహెచ్‌వో జయశ్రీ, సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సిబ్బంది శ్రీనివాస్, శాంతకుమారి, విజయరెడ్డి, రవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో విషజ్వరాలపై చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తనుజా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ యండీ ఇమాం,సిబ్బంది ఉన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల, తుమ్మలచెరువు, అమెర్ధకాలనీ, మొండికుంట, సీతరాంపురం గ్రామాల్లో మండల వైద్యాధికారి సంకీర్తన ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు మిట్టగూడెం గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామాల్లో ఫ్రైడే–డ్రైడే నిర్వహించారు.



దుమ్ముగూడెం: నిల్వనీరు పారబోస్తున్న సిబ్బంది



చంద్రుగొండ : మహ్మద్‌నగర్‌లో వైద్యశిబిరం

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

పినపాక/ కరకగూడెం: ప్రభుత్వ ఆదేశాల మేరకు పారదర్శకంగా అర్హులకు పథకం అమలు చేస్తామని భద్రాచలం ఆర్డీఓ మంగిలాల్ అన్నారు. శుక్రవారం పినపాక మండల పరిషత్ కార్యాలయం, కరకగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న గృహలక్ష్మి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం పినపాకలోని భూపాలపట్నం పంచాయతీలో, కరకగూడెంలోని కలువనాగరంలో క్షేత్రస్థాయి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక త్వరతగతిన పూర్తి చేయాలని, వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహలక్ష్మి వర్తిస్తుంది

దుమ్ముగూడెం: అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తిస్తుందని ఎంపీపీ రేసు లక్ష్మీ అన్నారు. శుక్రవారం కొత్తదంతెనం గ్రామంలో జరుగుతున్న గృహలక్ష్మి పథకం ఇంటింటి సర్వే పనులను నోడల్ అధికారి సులోచనతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం పెద మధ్యతరగతి కుటుంబాలకు గృహలక్ష్మి పథకంతో సొంత ఇంటి కలను సాకారం చేస్తుందని ఈ పథకం దశలవారీగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేస్తారని వచ్చే ఐదేళ్లలో అందరికీ సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కణితి రాముడు, జానిపాషా, దామెర్ల శ్రీనివాసరావు, మోతుకురి శ్రీకాంత్, సర్పంచ్ సరియం సీతారాం తదితరులు పాల్గొన్నారు.



పినపాక: దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ



దుమ్ముగూడెంలో..

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్ మాట్లాడుతూ... కన్వేయన్స్ డ్రైవర్లకు న్యాయంగా చెల్లించాల్సిన జీతభత్యాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏరియా ఎస్ఓటు జీఎం ఈసం కృష్ణయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీ.రామనర్సయ్య, ఆదార్ల సురేందర్, యోహాన్, డ్రైవర్ల సంఘం అధ్యక్షులు అన్వర్‌ఖాన్, బి సత్యనారాయణ, వి రాము తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల గ్రామస్తుల ఆందోళన

దుమ్ముగూడెం : పర్ణశాల గ్రామంలోకి వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారిని దేవస్థానం అధికారులు మూసివేస్తుండగా గ్రామస్తులు ఆందోళన చేపట్టి పనులను శుక్రవారం అడ్డుకున్నారు. పర్ణశాల వచ్చే భక్తులు ఆలయంలోకి వెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న దారి కాకుండా వేరే దారి గుండా భక్తులను అనుమతించాలని పాతదారిని మూసివేయాలని దేవస్థానం ఈఓ రమాదేవి ఆలయ సిబ్బందికి సూచించడంతో సిబ్బంది ప్రధాన రహదారిని మూసేందుకు పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు ఆ పనులను అడ్డుకోగా సిబ్బందితో వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై కేశవరావు గ్రామస్తులతో, దేవస్థానం సిబ్బందితో మాట్లాడి యథాస్థితి కొనసాగేలా చేశారు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలి

అశ్వాపురం: మండలంలో గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి అర్హులైన వారందరికీ ఇళ్లు కేటాయించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలను బట్టి గృహలక్ష్మి పథకంలో ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆశలన్నీ డ్రెయినేజీ పాలు!



బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు (ఫైల్)

ములకలపల్లి: మలకలపల్లి మండలకేంద్రంలో సెంట్రల్‌లైటింగ్ పనులకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం భూమిపూజ చేయనున్నారు. దీంతో ఎన్నో ఏళ్ల కల సాకారం కానుంది. కానీ సెంట్రల్‌లైటింగ్‌తోపాటు డ్రెయినేజీ కూడా నిర్మిస్తారని ఆశపడ్డ స్థానికులకు చివరికి నిరాశే మిగిలింది. కేవలం లైటింగ్‌కు రూ 5.75 కోట్ల నిధులు మంజూరు కాగా ఫోర్‌లైన్ బీటీ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మించనున్నారు. దీంతో డ్రెయినేజీ నిర్మాణంలేదని తెలుస్తోంది. ప్రధాన కేంద్రంలో మురుగునీటి ప్రవాహం ప్రధాన సమస్యగా మారింది. ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాలకు చెందిన నీరు అప్పుడప్పుడు రోడ్డుపై నుంచే ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసరావును వివరణ కోరగా డ్రెయినేజీ నిర్మాణానికి మరో రూ.75 లక్షలు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తిచేస్తామన్నారు.